వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తదితరులు



ఏపీ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- వైఎస్సార్‌సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి
- కేపీహెచ్‌బీలో వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ ఆధ్వర్యంలో దర్శి ప్రజల ఆత్మీయ సమ్మేళనం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీ కమ్యూనిటీహాల్‌లో వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ ఆధ్వర్యంలో దర్శి నియోజకవర్గ ప్రజలకు బూచేపల్లి వారి ఆత్మీయ సమావేశం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీలోని ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఏపీ వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ ప్రెసిడెంట్ సునీల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశానికి యువత పెద్ద ఎత్తున హాజరయ్యారు.

◆ ఈ సందర్భంగా దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. జగనన్న ప్రవేశపెట్టిన నాడు-నేడు, పారిశ్రామిక క్లస్టర్‌లు, రామాయం పోర్టు, పేదలకు ఎటువంటి దళారులు లేకుండా వారి అకౌంట్లలో పథకాలకు సంబంధించి సహాయం అందజేయటం వంటివి తెలుగుదేశం పార్టీ వారికి కానీ, చంద్రబాబుకి కనిపించటం లేదా అని ఆయన ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో జగనన్న కరోనా లాంటి కష్టకాలంలో చేసిన మంచి పనులు నుంచి వలంటీర్ వ్యవస్థ ద్వారా జరుగుతున్న పనులు, విద్యా వ్యవస్థలో తెచ్చిన మార్పులు ప్రతి ఇంటికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.



◆ టీడీపీ తప్పుడు ప్రచారాలు చేస్తోందన్నారు. మనం చేసిన మంచి పనులు ప్రతి ఒక్కరిని తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆ బాధ్యతను ఐటీ నిపుణులు, వైఎస్ఆర్‌సీపీ అభిమానులు తీసుకోవాలని ఆయన కోరారు. వారంలో రెండు రోజులు నియోజకవర్గానికి కేటాయించాలని ఆయన ఐటీ నిపుణులు, అభిమానులను కోరారు. ఈ సందర్భంగా పలువురు యువకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కోవిడ్ సమయంలో ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన కార్యక్రమాలు దేశం మొత్తం చూసిందన్నారు. చాలా మంది యువతకు రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టి ఫీజు రీయింబర్స్‌మెంట్ కార్యక్రమాలు, ప్రస్తుతం జగన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నాడు-నేడు కార్యక్రమాలు పేద, మధ్య తరగతి వారి అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు.

ఫుట్‌ఓవర్ బ్రిడ్జి.. లిఫ్ట్ లేక అవస్థలు



అపరిశుభ్రంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి



లిఫ్ట్ ఏరియా

- మెట్లు ఎక్కలేకపోతున్నామని అంటున్న వృద్ధులు, మహిళలు
- బ్రిడ్జిపై చెత్త, అపరిశుభ్రత, దుర్వాసన
- అధికారులు చర్యలు తీసుకోవాలని వినతి

మూసాపేట: మూసాపేట చౌరస్తాలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ప్రారంభించి నెలలు గడుస్తున్నప్పటికి లిఫ్ట్ లేకపోవటంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రూ.2.9 కోట్లతో ప్రారంభించిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి లిఫ్ట్ పనులు చేయాల్సి ఉంది. లిఫ్ట్ పనులు పూర్తయిన తరువాతనే బ్రిడ్జిని ప్రారంభించాలి. కానీ బ్రిడ్జి ప్రారంభించి నెలలు గడుస్తున్నా లిఫ్ట్ పనులు చేయకపోవటంతో మహిళలు, వృద్ధులు మెట్లు ఎక్కలేక అవస్థ పడుతున్నారు. మూసాపేటలో నివాసం ఉండే పలువురు కార్మికులు బాలానగర్, ప్రశాంత్‌నగర్ ప్రాంతాల్లోని కంపెనీల్లో పనిచేసేందుకు వెళుతుంటారు. ఉదయం వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చే క్రమంలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఎక్కి తిరిగి మూసాపేట వైపు దిగాలంటే మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మూసాపేట చౌరస్తాలో ఉన్న బ్యాంకులకు ప్రతి నెలా పింఛన్ తీసుకునేందుకు వృద్ధులు, వికలాంగులు వస్తూంటారు. లిఫ్ట్ లేకపోవటం వల్ల బ్రిడ్జి ఎక్కి దిగేందుకు ఇబ్బందిపడుతున్నారు. బ్రిడ్జి మెట్లు కూడా చిన్నగా ఉండటం వల్ల ఎక్కలేక పోతున్నామని వారు వాపోతున్నారు. అసలే కాళ్ల నొప్పులు, నడవలేకపోతుంటే మెట్లు ఎక్కి దిగాలంటే పెద్ద సాహసమే చేయాల్సి వస్తుందని అంటున్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి వల్ల సమస్య తీరుతుందనుకుంటే మెట్లు ఎక్కలేక కొత్త సమస్య ఎదురైందని వాపోతున్నారు. ఇక లిఫ్ట్ స్థలం బిచ్చగాళ్లకు ఆవాసంగా మారింది. మెట్లు ఎక్కేవారికి ఇబ్బందులు కలిగిస్తున్నారు. రాత్రి సమయంలో అక్కడే తాగి బాటిళ్లను కూడా పడేస్తున్నారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి మూలల్లో చెత్తా చెదారం, దుర్వాసన వెదజల్లుతోంది. కూడళ్లలో జీహెచ్‌యంసి అధికారులు స్వచ్ఛ సర్వేక్షణ్ పేరుతో చెత్త వేసే వారిపై చలానా విధిస్తుండటంతో చెత్త తెచ్చి ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై పడవేస్తున్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. బ్రిడ్జి ప్రారంభించిన నాటి నుంచి ప్రస్తుతం ఒక్కసారైనా శుభ్రం చేయలేదేమోనని పాదచారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. లిఫ్ట్ ప్రాంతం, మెట్లపై పాన్ పరాగ్‌లు, కిళ్లీలతో అపరిశుభ్రంగా పేరుకుపోయి నడవలేని పరిస్థితి నెలకొంది. రోడ్డు దాటడానికి బ్యారికేడ్లతో ట్రాఫిక్ పోలీసులు పూర్తిగా మూసివేయటంతో ఫుట్‌ఓవర్‌పైనే నడవాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి లిఫ్ట్ ఏర్పాటు చేయటంతో పాటు ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, రాత్రిపూట మందుబాబులు లేకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నెల రోజుల్లో లిఫ్ట్ అందుబాటులోకి..

మూసాపేటలోని ఫుట్‌ఓవర్ బ్రిడ్జి లిఫ్ట్‌ను మరో నెల రోజుల్లో అందుబాటులోకి తీసుకువస్తాం. వారంలో పనులు ప్రారంభిస్తాం.

– పవన్, జీహెచ్‌ఎంసీ ఏఈ

15న ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం

పంజగుట్ట: ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 15వ తేదీన లక్డీకాపూల్‌లోని సెంట్రల్ కోర్టు హోటల్‌లో నిర్వహిస్తున్నట్టు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి, తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం ప్రకటించారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ వెంట ఏ ఒక్క ఉద్యమకారుడు లేరన్నారు. కేసీఆర్ తన కుటుంబం బాగుపడేందుకే ఉద్యమకారులను వాడుకున్నారని ఆరోపించారు. గత పదేళ్లలో ఒక్కసారి కూడా ఉద్యమకారులకు అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని గుర్తుచేశారు. ఆత్మీయ సమ్మేళనంలో ఉద్యమకారులు ప్రొఫెసర్ కోదండరామ్, స్వామిగౌడ్, అందె శ్రీ, పాశం యాదగిరి, విమలక్క పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో రమేశ్‌యాదవ్, సంజీవన్ నాయక్, ఉపేందర్, ఆజాద్, శ్వేత, పద్మశాలి రాజు, కృష్ణ, బాబురావు, సురేశ్, చిరుమర్తి రాజు పాల్గొన్నారు.

'బీసీలను మోసం చేస్తే సహించేది లేదు'

పంజగుట్ట: రాష్ట్రంలో బీసీలకు కేటాయించిన బడ్జెట్ కన్నా ఇంట్లో భార్యాభర్తలు వేసుకునే బడ్జెట్ బాగుంటుందని యునైటెడ్ పూలే ఫ్రంట్ కన్వీనర్ గట్టు రామచంద్రరావు విమర్శించారు. అసెంబ్లీలో పూలే విగ్రహం ఏర్పాటు చెయ్యాలనే డిమాండ్‌తో నేడు ఇందిరా పార్క్ వద్ద నిర్వహించాలనుకున్న ధర్నా తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో వాయిదా వేసినట్లు చెప్పారు. ఈమేరకు ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోకన్వీనర్లు తాడూరి శ్రీనివాస్, రాజారామ్ యాదవ్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో ఏర్పాటుచేసిన బీసీ డిక్లరేషన్ సభలో బీసీలకు ఐదేళ్లలో లక్ష కోట్లు కేటాయిస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. కానీ, ఈ బడ్జెట్‌లో కేటాయించింది కేవలం 8 వేల కోట్లు అని చెప్పారు. ఆరు నెలల్లో బీసీ కమిషన్ ద్వారా రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. జ్యోతి రావు పూలే సబ్‌ప్లాన్‌కు ఈ అసెంబ్లీ సెషన్‌లోనే చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.

బీసీలను విస్మరిస్తే గుణపాఠం చెబుతాం

లిబర్టీ: మిషన్-2024 లక్ష్యంగా బీసీల సంఘటిత శక్తిని నిరూపిస్తామని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుంద్రు కుమారస్వామి వెల్లడించారు. ఆదివారం దళ్ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్తు అంతా బీసీలదేనని తమని నిర్లక్ష్యం చేస్తే కేంద్ర ప్రభుత్వానికి గద్దె దింపుతామని ప్రతిజ్ఞ చేశారు. బీసీలను విస్మరించడం వల్లే అధికారం పోయిందన్న బాధ కేంద్ర ప్రభుత్వానికి త్వరలోనే తెలుస్తుందని చెప్పారు.

'అన్ని కులాల జన గణన జరపాలి'

పంజగుట్ట: తెలంగాణలో ప్రతి వ్యక్తి కులగణన జరపాలని.. కేవలం బీసీల కుల గణన చేస్తే అందరికీ న్యాయం ఎలా జరుగుతుందని జస్టిస్ వి.ఈశ్వరయ్య ప్రశ్నించారు. పీపుల్స్ కమిటీ ఆన్ కాస్ట్ సెన్సెస్ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ కులాల సమగ్ర గణన డిమాండ్‌తో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రొఫెసర్ మురళీ మనోహర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో అన్ని కులాల వివరాలు బయటకు తీశారని తెలిపారు. అదే తరహాలో ఇక్కడ కూడా అన్ని కులాల గణన జరపాల్సిందేనని డిమాండ్ చేశారు. అన్ని కులాల సమగ్ర గణన చెయ్యాలన్న విషయన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. బీసీ మేధావులు, న్యాయ నిపుణులతో సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి చర్చించాలని కోరారు.

'మనూ'లో ఇద్దరికి పీహెచ్‌డీలు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఇద్దరు పరిశోధక విద్యార్థినులకు పీహెచ్‌డీలను ప్రకటించారు. విమెన్ స్టడీస్ పరిశోధక విద్యార్థిని నసీమాఖాతూన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పర్వీన్‌ఖమర్ పర్యవేక్షణలో ' ఇంపాక్ట్ ఆఫ్ కల్చరల్ ప్రాక్టీసెస్ ఆన్ ముస్లిం కమ్యూనిటీ ఇన్ 'మౌ' డిస్ట్రిక్ట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్- ఏ జెండర్ ఎనాలిసిస్' అనే అంశంపై థీసిస్‌ను సమర్పించారు. అలాగే హిందీ విభాగంలో పరిశోధక విద్యార్థిని ఉష అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జివిరత్నాకర్ పర్యవేక్షణలో 'సుశీలా తక్భౌరే కే సాహిత్య మే దళిత్ నారి చేత్నా' అనే అంశంపై థీసిస్ సమర్పించగా ఆమెకు పీహెచ్‌డీని ప్రకటించారు.

హెచ్‌సీయూలో జింకపై కుక్కలదాడి

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జింకపై కుక్కలు దాడి చేశాయి. హెచ్‌సీయూలోని పీహెచ్‌డీ స్కాలర్స్ హాస్టల్ వెనుక శనివారం రాత్రి జింకపై కుక్కలు దాడి చేయడంతో అది తీవ్రంగా గాయపడింది. ఈ ఘటనను చూసిన విద్యార్థులు కుక్కలను తరిమి జింకను క్యాంపస్‌లోని హెల్త్ సెంటర్‌కు తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. ప్రధానంగా హెచ్‌సీయూ క్యాంపస్‌లో భవనాల నిర్మాణం కోసం చెట్లను తొలగిస్తుండడంతో జంతువులు ప్రత్యామ్నాయ ప్రాంతాలకు వెళ్లే క్రమంలో దాడులు జరుగుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జంతుజాలం ఉండే ప్రాంతాలను గుర్తించి వాటి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

డబ్బింగ్ ఆర్టిస్టులకు 'డాట్' అన్యాయం

శ్రీనగర్‌కాలనీ: డబ్బింగ్ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆఫ్ తెలుగు టెలివిజన్(డాట్) సభ్యుల అక్రమ దందా ఇండస్ట్రీలో పెరిగిపోయిందని ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు వి.సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాట్ అసోసియేషన్ కార్డు ఉంటేనే డబ్బింగ్ చెప్పాలంటూ కొత్తగా వచ్చే కళాకారులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. అంతేగాకుండా డబ్బింగ్ స్టూడియోలకు వెళ్లి కార్మికుల వేతనాలు సైతం డాట్ డబ్బింగ్ అసోసియేషన్ బ్యాంకు ఖాతాలోనే వేయాలని డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. ఆంధ్రా పెత్తందారుల చేతిలో నేటికీ తెలంగాణ సినీ, టీవీ కార్మికులు నలికిపోతున్నారని విమర్శించారు.

బేబీ సినిమా నిర్మాత, డైరెక్టర్‌పై కేసు నమోదు

గచ్చిబౌలి: బేబీ సినిమా నిర్మాత, డైరెక్టర్లపై రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో పైరసీ, చీటింగ్ కేసు నమోదైంది. సీఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం... రచయిత, సినిమాటోగ్రాఫర్, షార్ట్ ఫిల్మ్స్ డైరెక్టర్ షిరిన్ శ్రీరాం తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో షిరిన్ శ్రీరాం కేఫ్‌గా బ్యానర్ నమోదు చేసుకున్నారు. తాను రాసిన ఓ కథకు కన్నా ప్లీజ్‌గా నామకరణం చేశారు. తనకు పరిచయమైన సాయి రాజేష్ నీలం అలియాస్ స్టీవెన్ శంకర్ ద్వారా కథను 2017లో అమృత బ్యానర్‌పై 'ప్రేమించొద్దుగా' మార్చారు. అదే కథను 'బేబీ'గా మార్చిన సాయిరాజేష్ ఆ కథ తానే రాశానని నిర్మాత శ్రీనివాస కుమారనాయుడు అలియాస్ ఎస్‌కేఎన్‌కు వివరించారు. 2023 జూలై 14న బేబీ సినిమా విడుదలైంది. బేబీ సినిమా నిర్మాతగా శ్రీనివాస కుమారనాయుడు, దర్శకుడుగా సాయి రాజేష్ నీలం వ్యవహరించారు. తాను రాసిన కథను బేబీగా మార్చి అమ్మి మోసం చేశారని షిరిన్ శ్రీరాం రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. శ్రీనివాస కుమారనాయుడు, సాయి రాజేష్‌లపై ఐపీసీ 420, పైరసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జనరిక్ స్టోర్‌లో తక్కువ ధరకే మందులు



భారత్ వికాస్ చారిటుబుల్ ట్రస్ట్ జనరిక్ మెడికల్ షాపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మూసాపేట: భారత్ వికాస్ పరిషత్ జనరిక్ మెడికల్ స్టోర్‌ను మూసాపేటలో ఆదివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. 12మంది దివ్యాంగులకు భారత్ వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్టు తరపున కృత్రిమ కాళ్లు, చేతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ అతి తక్కువ ఖర్చుతో మందులు అందించడం అభినందనీయమన్నారు. అనంతరం వివేకానంద సేవా సమితి చైర్మన్ సీహెచ్. హనుమంతరావు, చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అశ్విని సుబ్బారావు మాట్లాడుతూ.. తక్కువ ధరకు మందులు తమ స్టోర్‌లో లభిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, ట్రస్టు సభ్యులు సీహెచ్ అనిల్, బి.అనిల్‌కుమార్, చైతన్య, మహేశ్వరి, సుదర్శన్, నరేంద్ర కృష్ణ, నరసింహ, తిరుపతి రెడ్డి, సదాశివరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్యశ్రీ సేవలు బలోపేతం చేస్తాం

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ





ప్రసాద్ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని.. అందులో భాగంగానే ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్యశ్రీ పథకాన్ని బలోపేతం చేస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. కూకట్‌పల్లి ఆదిత్యనగర్ కాలనీలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ హెల్త్‌కార్డుల అమలుకు ముఖ్యమంత్రి ఎంతో ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. తమ ప్రభుత్వం ఆరోగ్య సంరక్షణ సేవలను అప్‌గ్రేడ్ చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.సుమప్రసాద్ మాట్లాడుతూ.. పదిహేనేళ్లుగా కూకట్‌పల్లిలో నాణ్యమైన సేవలందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్, శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద, బి.లక్ష్మారెడ్డి, విక్రమ్‌రెడ్డి, మల్కా కొమరయ్య పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరాన్ని సందర్శిస్తున్న రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు

అల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్‌లోని మెడిషూర్ ఆస్పత్రిలో నంది బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు హాజరై రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం చేయటం వల్ల మరొకరికి ప్రాణం పోయవచ్చన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. ప్రతి 3 నుంచి 6 నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలో అందిస్తున్న ఇతర సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని అన్నారు. అనంతరం వైద్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఉపాధ్యక్షులు అల్లూరి రామరాజు, డాక్టర్ ధనుంజయ్, దుర్గాప్రసాద్‌రావు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

హఫీజ్‌పేట్: మారిన జీవనశైలి వల్ల ప్రజలు వ్యాధులకు గురవుతున్నారని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం హఫీజ్‌పేట్ డివిజన్ మదీనాగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సిటిజన్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ షకీనా గ్రేసి, డాక్టర్ కృష్ణలు మాట్లాడుతూ వ్యాయామం, మెడిటేషన్, యోగా, ధ్యానం, నడక, కనీసం 40 నిమిషాలు చేయాలన్నారు. సాధ్యమైనంత వరకు తాజా ఆకుకూరలు, సీజనల్ ఫ్రూట్స్, పాలు, పాల ఉత్పత్తులు, చేపలు, గుడ్లు, తృణధాన్యాలు, డ్రై ఫ్రూట్స్ వంటి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. శిబిరంలో 95 మందికి వైద్య సేవలు అందించారన్నారు.



శుభాకాంక్షలు



కళ్యాణినగర్‌నూతన సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని కళ్యాణినగర్ సంక్షేమ సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన వసంతరావు, అసోసియేషన్ సభ్యులు ఆదివారం స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని రవీందర్ రెడ్డి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గెలిచిన సంక్షేమ సంఘం సభ్యులు ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని, కళ్యాణినగర్‌లో ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు.

ఘరియా జ్యోతి పథకానికి విశేష స్పందన

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ సఫ్దార్‌నగర్‌లో ఆదివారం కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ ఆధ్వర్యంలో ఘరియా జ్యోతి పథకం క్రింద దరఖాస్తు నమోదు కార్యక్రమం నిర్వహించారు. బస్తీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని దరఖాస్తు చేసుకుని ఈ పథకంలో చేరారు. ఈ పథకానికి కావల్సిన ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, విద్యుత్ బిల్లులను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జమీర్, అబ్దుల్లా, నజీర్, వహీద్, ఇస్మాయిల్, అడ్డూ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

మూసాపేట: మూసాపేటలో ఈదమ్మ, ఎల్లమ్మ తల్లి ఆలయంలో 14న నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు నోముల సుందర్ తెలిపారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు అనంతరం 10.35 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందన్నారు. స్థానికులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ పరిధిలోని భవానీపురం బస్తీలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఆదివారం శేరిలింగంపల్లి ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారందరికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు.

'సికింద్రాబాద్' మేనిఫెస్టో ఆవిష్కరణ

పంజగుట్ట: కాంగ్రెస్ నేత, సీఏ వేణుగోపాల స్వామి ఆధ్వర్యంలో రూపొందించిన సికింద్రాబాద్ పార్లమెంటు మేనిఫెస్టోను కాంగ్రెస్ ఫర్ సికింద్రాబాద్ స్టూడెంట్స్, వర్కింగ్ ప్రొఫెషనల్ ప్రతినిధులు ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఈసారి సికింద్రాబాద్ పార్లమెంటుని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నిధులతో పాటు స్వచ్ఛంద సంస్థల నిధులను కూడా వినియోగించేలా మేనిఫెస్టో రూపొందించినట్టు తెలిపారు. సమస్యలు తెలుసుకునేందుకు త్వరలోనే సీఏ వేణుగోపాల స్వామి అన్ని డివిజన్లలో పాదయాత్రలు చేయనున్నట్టు తెలిపారు.

జేఎన్‌టీయూ ప్రొ. డి.శ్రీనివాసరావు మృతి



బాలానగర్: జేఎన్‌టీయూ డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ ఆడిట్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ సీనియర్ ప్రొఫెసర్ డా. డి. శ్రీనివాస్‌రావు బ్రెయిన్ హేమరేజ్‌తో మృతి చెందారు. వారం రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. డా. శ్రీనివాసరావు యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఈసీఈ డిపార్టుమెంట్‌లో చేరిన తరువాత పలు రకాల పదవులు పొంది ఎంతో బాధ్యతాయుతంగా నిర్వహించారు. డిపార్టుమెంట్ హెచ్‌ఓడీ, యూనివర్సిటీ ఆటిట్ డిపార్టుమెంట్ డైరెక్టర్‌గా, టెక్యూప్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. సౌమ్యులుగా తోటి అధ్యాపకులతో స్నేహభావంతో ఉండేవారు. విద్యార్థులకు తన విషయ పరిజ్ఞానం పూర్తి స్థాయిలో అందించి మంచి అధ్యాపకులుగా గుర్తింపు పొందారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డా. కట్టా నర్సింహారెడ్డి, రిజిస్ట్రార్ డా. కె.వేంకటేశ్వరరావు, రెక్టార్ డా. విజయకుమార్‌రెడ్డి, కాలేజీ ప్రిన్సిపాల్, డా. జీవీ నర్సింహారెడ్డి, ఈసీఈ డిపార్టుమెంట్ ప్రొఫెసర్లు, పలువురు అధికారులు, ప్రొఫెసర్లు, నల్లగండ్లలోని ఆయన స్వగృహంలో ఆయన భౌతిక కాయం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాన్ టీచింగ్ స్టాఫ్ సంతాపం తెలిపారు.

శ్రీవివేకానందనగర్ ఎన్నికలు నిర్వహిస్తాం

మోతీనగర్: శ్రీవివేకానందనగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మాజీ అధ్యక్షుడు పులిగొళ్ల శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన కమిటీహాల్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆరేళ్లుగా శ్రీవివేకానందనగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు నిర్వహించకుండా కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నారని తెలిపారు. దీంతో కాలనీ ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందన్నారు. అభివృద్ధి జరగాలంటే ఎన్నికలు జరగాలనే అభిప్రాయం వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో పోటీ చేసే వారి పేర్లను నమోదు చేసుకున్నారు. నలుగురు సభ్యుల కమిటీ ఏర్పాటు చేశారు. వీరి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించాలని తెలిపారు. కమిటీలో పులిగొళ్ల శ్రీనివాస్ యాదవ్, తుంగం శ్రీనివాస్, రామచంద్రరెడ్డి, అప్పారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లో మాట్లాడుతున్న రవికుమార్ యాదవ్

హఫీజ్‌పేట్ : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శేరిలింగంపల్లి బీజేపీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లో భారత్ వికసిత సంకల్ప్ యాత్ర ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల కోసం ఉజ్వల యోజన, సీఎం స్వనిధి, పేద ప్రజల ఆరోగ్యం కోసం పీఎం సురక్ష బీమా, ఆయుష్మాన్ భారత్, చిరు వ్యాపారుల కోసం ముద్రలోన్, చేతివృత్తుల వారి కోసం విశ్వకర్మ యోజన తదితర పథకాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి కిరణ్‌కుమార్, ఆరోగ్య అధికారి డాక్టర్ అరవింద్, బ్యాంక్ మార్కెటింగ్ అధికారి తేజ, శ్రీధర్, మనోహర్, రవిగౌడ్ పాల్గొన్నారు.

'కొల్లూరు'కు డాక్టరేట్

శ్రీనగర్‌కాలనీ: హైకోర్టు అడ్వకేట్, సామాజికవేత్త కొల్లూరు వెంకట నరసింహారావుకు గౌరవ డాక్టరేట్ దక్కింది. హోప్ థియోలాజికల్ యూనివర్సిటీ నుంచి ఆయన ఈ గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని పేద ప్రజలకు ఉచితంగా న్యాయసేవలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో త్యాగరాజ గానసభలో గ్రాడ్యుయేషన్ అండ్ అవార్డ్స్-2024 కార్యక్రమంలో భాగంగా ఆదివారం 'డాక్టర్ ఆఫ్ బెస్ట్ సోషల్ సర్వీస్'ను అందిచినట్లు ప్రతినిధులు తెలిపారు.

జై జవాన్.. జై కిసాన్‌కు విరాళం

గవర్నర్‌కు అందజేసిన త్రివేణి విద్యాసంస్థల అధినేత వీరేంద్ర చౌదరి



హఫీజ్‌పేట్ : జై జవాన్.. జై కిసాన్ నిధికి త్రివేణి విద్యా సంస్థల అధినేత డాక్టర్ వీరేంద్ర చౌదరి, పాఠశాలల విద్యార్థులు కలిసి ఆదివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ డాక్టర్ తమిళిసైకి విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ సైనికులకు, రైతులకు మద్దతుగా నిలవడం కోసం విద్యార్థులు, విద్యా సంస్థల తరపున రూ.1,00,116ల విరాళం అందజేయడం జరిగిందన్నారు. దేశ రక్షణ కోసం నిరంతరం అప్రమత్తంగా ఉండే సైనికులకు, భారతదేశానికే కాకుండా ప్రపంచ దేశాలకు కూడా ఆహారాన్ని ఇతర పంటలను పండించి నిరంతరం కష్టం చేసే రైతన్నలకు మద్దతు తెలియజేస్తూ ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం గవర్నర్ విద్యార్థులకు మిఠాయిలు పెట్టారని ఆయన తెలిపారు.